అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలంటూ

నేటినుంచి జిల్లా కేంద్రాల్లో ధర్నాలు

చిక్కడపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ రూ. 2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23 నుంచి 27 వరకు జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ధర్నాలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంఘం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. 50 శాతం మంది రైతులకే రుణమాఫీ జరిగిందని, మిగిలిన వారు బ్యాంకులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులను పరిగణనలోకి తీసుకోరాదని డిమాండ్ చేశారు. రుణమాఫీ జరిగిన వారికి తిరిగి కొత్తగా రుణాలు ఇవ్వాలన్నారు. సారంపల్లి మల్లారెడ్డి, ఎల్‌బీ కృష్ణ, వెంకటచారి పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవాటు చేసుకోవాలి


పూజల్లో లక్ష్మణ్, రమణ తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అందరూ సేవాగుణాన్ని అలవాటు చేసుకోవాలని ఎం.పి. డా. కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ పీఆర్‌వో డా.జీకే రమణ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో ఆంజేయ స్వామి దేవాలయంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించి షుగర్ టెస్ట్ పరికరాలను ఉచితంగా అందజేశారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో డా. లక్ష్మణ్, రమణ, ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ఆలయ ఈవో దేవనాథం పాల్గొన్నారు.

బీజేపీ నేతకు లక్ష్మణ్ పరామర్శ

బీజేపీ సీనియర్ నాయకుడు ఠాగూర్ విష్ణువర్ధన్‌సింగ్‌ను ఎంపీ డా. లక్ష్మణ్ గురువారం పరామర్శించారు. విష్ణుసింగ్‌కు ఇటీవల బైపాస్ సర్జరీ జరిగింది. కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నాయకులు రమేష్ రామ్, రాజాగౌడ్, శ్రీకాంత్, మెతుకు ఉమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతంలో హెచ్చరిక బోర్డు



పార్శీగుట్టలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ముషీరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పార్శీగుట్టలో వరద ముంపు ప్రాంతంలో అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వర్షం కురిసినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని జీహెచ్‌ఎంసీ డీఈ గీతాకుమారి, ఏఈ మురళి తెలిపారు.

హస్తకళలను ఆదరించాలి


జ్యోతి వెలిగించి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ

కవాడిగూడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హస్త కళలను ఆదరించాలని రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ కోరారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సాయి చేనేత కాటన్, సిల్క్ ఎక్స్‌పో హస్తకళల, చేనేత వస్త్రాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గద్వాల్, వెంకటగిరి, ధర్మవరం, పోచంపల్లి, ఉప్పాడ పట్టు చీరలు, చీరాల ఫ్యాన్సీ ఖాదీ, కాటన్ ప్రింటెండ్, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలతో పాటు తదితర అనేక వస్తువులు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నిర్వాహకురాలు కంభంపాటి పద్మజ మాట్లాడుతూ.. ప్రదర్శన ఈనెల 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు కొనసాగుతుందన్నారు.

26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

● **నేటి నుంచి 26 వరకు వివిధ రంగాల్లో పిల్లలకు పోటీలు**


శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

నల్లకుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తి వేదన స్వామి ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. గురువారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ కో-ఆర్డినేటర్ శ్రీవాణి, ప్రతినిధులు లలితకాంబ్రా, అంజనాదేవి, సునీల్‌రాఠి మాట్లాడారు. 6వ తేదీ ఉదయం 7.30 మహాభిషేకం, మధ్యాహ్నం మహా హారతి, కీర్తన మేళ, అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు గానం, నృత్యం, కలరింగ్, డ్రాయింగ్, వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్, శ్లోక పఠనం తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. 26 సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి గల వారు వివరాల కోసం 9440486792 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ముగిసిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


రథోత్సవం నిర్వహిస్తున్న రాఘవేంద్రస్వామి మఠం నిర్వాహకులు

బర్కత్‌పుర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు గురువారం ముగిశాయి. స్వామికి పంచామృతాభిషేకం, ఉత్సవ మూర్తికి కనక మహాపూజ నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ, పార్కు మీదుగా తిరిగి రాఘవేంద్రస్వామి మఠానికి చేరుకుంది. రథోత్సవంలో కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన మహిళా కోలాట బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్, అధికార ప్రతినిధి చిట్టి శ్రీధర్, శ్రీరాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ సూర్యచంద్రశేఖర్‌శర్మ, బృందావన సమితి అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి, కార్యదర్శి బి. పి. రాఘవేందర్‌రావ పాల్గొన్నారు.

26న కృష్ణస్వామి జయంతి వేడుకలు

పద్మారావునగర్, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర తొలిమేయర్ కొర్వి కృష్ణస్వామి జయంతి వేడుకలను ఈనెల 26న సికింద్రాబాద్‌లోని ముదిరాజ్‌భవన్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సికింద్రాబాద్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు డి.సదానంద్, జి.దివాకర్, శ్రీకాంత్, సురేష్, నర్సింగరావు మాట్లాడారు.

తల్లిదండ్రులు మందలించారని ముంబై వెళ్లబోయిన బాలిక

● **నాంపల్లి రైల్వే స్టేషన్‌లో చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు**

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ముంబై వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న బాలికను ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హయత్‌నగర్‌కు చెందిన మహ్మద్ జహంగీర్ కుమార్తె(17) తల్లిదండ్రులు మందలించారని గురువారం ముంబై వెళ్లేందుకు నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. పెట్రోలింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు బాలికను చేరదీసి వివరాలు సేకరించి ప్రభుత్వ చైల్డ్‌లైన్ హోమ్‌కు తరలించారు.

ఇంటి శుభ్రతతో వ్యాధులకు చెక్



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందంటున్నారు చెఫ్ కునాల్ కపూర్. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడానికి వినూత్న పద్ధతులను అనుసరించాలని సూచిస్తున్నారు. వేప నూనెతో ఫ్లోర్‌ను శుభ్రం చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయంటున్నారు.

ఫ్లోర్ పొడిగా ఉండాలి

వర్షాకాలంలో తేమ అధికంగా ఉంటుంది. తేమ వాతావరణంలో కంటికి కనిపించని సూక్ష్మ జీవులు అధికంగా వృద్ధి చెందే అవకాశాలున్నాయి. వీలైనంత వరకు ఫ్లోరింగ్ పొడిగా ఉండేలా చూసుకోవాలి. నునుపుగా ఉండే టైల్స్‌పై నీరు పడితే కాలు జారే ప్రమాదం ఉంటుంది. ఫ్లోరింగ్ తడిగా ఉంటే ఎప్పటికప్పుడు తుడిచివేయడం మంచిది.

డోర్ మ్యాట్స్..

చాలామంది వర్షాకాలంలో డోర్ మ్యాట్స్ తడిచిపోతాయని సరిగా వాడరు. ఈ సీజన్‌లో హెవీ డ్యూటీ రబ్బర్ డోర్ మ్యాట్ బయటవైపు ఉంచడంతోపాటు ఇంటి లోపల నీరు పీల్చుకునే డోర్ మ్యాట్ వాడటం వల్ల ఇల్లు శుభ్రంగా ఉంచుకోవచ్చు.

డాగ్ ప్రేమికులు జాగ్రత్తగా ఉండాలి

ఇటీవల కాలంలో చాలామంది కుక్కలు లేదా పిల్లులను పెంచుతున్నారు. వర్షాకాలంలో వాటి కాళ్లు తడవడం వల్ల నేలపై మరకలు పడటంతోపాటు వాటికి అంటువ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. వాటి పాదాలు శుభ్రం చేయడంతోపాటు పెట్ ఫ్రెండ్లీ ఫ్లోర్ క్లీనర్ వాడాలి.

యాసిడ్, ఫినాయిల్

ఫ్లోర్‌పై మరకలు పోవడానికి కొంతమంది యాసిడ్, ఇల్లు శుభ్రం చేయడానికి ఫినాయిల్ వాడుతుంటారు. వాటివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. కొంతమందికి చర్మ సమస్యలు లాంటివి రావచ్చు. అనారోగ్యం కలిగించే వాటిని వాడకుండా చర్మ ఆరోగ్యం పాడవకుండా ఉండే, ఘాటు వాసన లేని క్లీనర్స్‌ను వాడితే మంచిది.

● వర్షాకాలంలో మంచాలపై దుప్పట్లను వారాల తరబడి మార్చకపోతే సమస్యలు రావచ్చు. మీతోపాటు మీ పెట్స్ కూడా తాజాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటిలో ఎక్కడా నీరు నిల్వకుండా చూసుకోవాలి. వర్షాకాలంలో తడిచిన దుస్తులు వాసన వస్తుంటాయి. వాటిని ఆరబెట్టడానికి చర్యలు తీసుకోవాలి.

తలుపులు మూసి ఉంచొద్దు

దోమలు వస్తాయని, జల్లు పడుతుందని ఇంటి తలుపులు, కిటికీలను వర్షాకాలంలో మూసి ఉంచొద్దు. ఇంట్లో ఉన్న తేమ, ఇతర చెడు వాసనలు బయటకు పోవడానికి గాలి ప్రసరించడం అవసరం. ఇంట్లో తేమ నివారణకు హ్యూమిడిఫైయర్లు లేదా ఫ్యాన్లను వాడటం మంచిది.

న్యాయ వ్యవస్థలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన న్యాయవాదుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

బీసీ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదులకు న్యాయమూర్తుల నియామకాలలో అవకాశం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అప్రెంటిస్ చేస్తున్న న్యాయవాదులకు నెలకు రూ. 10 వేలు స్టైఫండ్ ఇవ్వాలన్నారు.

కార్యక్రమంలో న్యాయవాదులు బత్తుల కృష్ణ, నాగుల శ్రీనివాస్ యాదవ్, సోషల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు వీవీ వెంకటేష్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, ఉపాధ్యక్షుడు మారోదు వినోద్‌కుమార్, బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ న్యాయవాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కృష్ణ

బీసీ న్యాయవాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా హైకోర్టు న్యాయవాది బత్తుల కృష్ణ నియమితులయ్యారు. గురువారం బీసీ భవన్‌లో ఆయన నియామకాన్ని ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థలో బీసీ న్యాయవాదులకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తామన్నారు. బీసీలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు సంఘం పక్షాన కృషి చేస్తానన్నారు.

జీవిత ప్రతిస్పందనను రేకెత్తించేవి ఛాయాచిత్రాలే


ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

బర్కత్‌పుర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జీవిత ప్రతిస్పందనను రేకెత్తించేవి ఛాయా చిత్రాలేనని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను గురువారం సజ్జనార్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫొటో జర్నలిస్టులు తమ చుట్టూ ఉన్న ప్రకృతి, మానవీయ సంఘటనలు, సమాజం, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రపంచం గురించి ప్రదర్శించిన చిత్రాలు అనుభూతిని కలిగించేలా ఉన్నాయన్నారు. విలువ, ఆధారిత జర్నలిజం కోసం యువ ఫొటో జర్నలిస్టులు కృషిచేయాలని సూచించారు. ఆర్టీసీ త్రూ ది లెన్స్ అనే థీమ్ మీద ఫొటోగ్రఫీ పోటీలు, ప్రదర్శన, ఉత్తమ చిత్రాలకు పురస్కారాల కార్యక్రమం రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం నిర్వహించాలన్నారు. ఇందుకు ఆర్టీసీ సహాయ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, ఉపాధ్యక్షులు కిషోర్‌సింగ్, పి. రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, కోశాధికారి అనిల్‌కుమార్ కర్నకోటి, కార్యవర్గ సభ్యులు ఎండీ. అలీముద్దీన్, గోపాల్, ప్రదర్శన నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎ. మహేష్‌కుమార్, సభ్యులు పి. సురేంద్ర, ఎల్లేశా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి బర్త్‌డే వేడుకలు


కేక్ కట్ చేస్తున్న హనుమాన్ సినిమా హీరో తేజ

చిక్కడపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిరంజీవి స్వయంకృషి అద్వితీయమని ప్రముఖ సినీ గేయ రచయిత డా. సుద్దాల అశోక్‌తేజ అన్నారు. కళారవిందం ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా సుద్దాల అశోక్‌తేజకు ఆత్మీయ సత్కారం జరిగింది. అశోక్ తేజ మాట్లాడుతూ.. చిరంజీవి ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. ఆయన గొప్ప నటుడు, మానవతావాది అన్నారు. వంశీ సంస్థల అధినేత డా. వంశీ రామరాజు, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు, కళాపోషకులు వెంకట్రావు, నిర్వాహకులు రామ్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

సుదర్శన్ థియేటర్‌లో..

ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం రాత్రి ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హనుమాన్ సినిమా హీరో తేజ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు మెగా విజయ్, రావులపాటి మోజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్

ముషీరాబాద్ అధ్యక్షుడిగా శ్రీధర్‌చారి



ముషీరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడిగా బీఆర్ఎస్ నాయకుడు పి. శ్రీధర్‌చారి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ఫెడరేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి శ్రీనివాస్‌చారి, జిల్లా ఇన్‌చార్జి లక్ష్మీనర్సింహసేన గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌చారి మాట్లాడుతూ.. విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అర్జున్

నల్లకుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నల్లకుంటకు చెందిన మాచర్ల అర్జున్ నియమితులయ్యారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మహేందర్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ ఎం. శ్యామ్ రాజ్ ముదిరాజ్ అర్జున్‌కు శాలువాకప్పి శుభాకాంక్షలు తెలిపారు. అర్జున్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు.

యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా మనోజ్ రెడ్డి



ముషీరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారిగా డాక్టర్ ఎం. మనోజ్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కోఠి యూపీహెచ్‌సీ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రి పరిధిలోని మురికివాడల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బాలిక అదృశ్యం

బర్కత్‌పుర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైంది. కృష్ణానగర్‌లో నివసిస్తున్న అబిద్‌ఖాన్ కుమార్తె పి. అంబిక(15) బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అంబిక ఆచూకీ లభించకపోవడంతో తల్లి పి. అశ్విని గురువారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

రేపు ఈఎంఆర్‌ఐలో ఉద్యోగ ఇంటర్వ్యూలు

మేడ్చల్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్‌ఐ(108) సంస్థలో డ్రైవర్లు, మెడికల్ టెక్నీషియన్ల నియామకాలను చేపడుతున్నట్లు ఈఎంఆర్‌ఐ ప్రోగామ్ మేనేజర్ షేక్ జాన్ షాహీద్ తెలిపారు. ఈనెల 24న కింగ్‌కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తమ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, డ్రైవర్ కోసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మెడికల్ టెక్నీషియన్ కోసం అభ్యర్థులు డి-ఫార్మసీ, నర్సింగ్‌తోపాటు ఆరోగ్యశాఖకు సంబంధించిన డిప్లొమో కోర్సు చదివి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు.

అందుబాటులోకి మెట్రో డీలక్స్ మంత్లీ పాస్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జోన్ ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం నుంచి మెట్రో డీలక్స్ మంత్లీ బస్‌పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. పాస్‌తో మెట్రోడీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. పాస్‌హోల్డర్లు సిటీ, సబర్బన్ పరిధుల్లో తిరిగే అన్ని బస్సుల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో

బీసీ నిరుద్యోగ యువతకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద బీసీ నిరుద్యోగ యువతకు కుషాయిగూడలోని ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఆశన్న తెలిపారు. టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 25 ఏళ్లలోపుగల అభ్యర్థులు ఈనెల 24లోపు www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, ఎస్‌ఎస్‌సీ మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు.

'ఓటరు నమోదుపై అవగాహన కల్పించండి'

రాంనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పేరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీ దివాకర్ సూచించారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఓటరు నమోదు అంశంపై సమావేశం నిర్వహించారు. అధికారులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రేమ్‌నగర్‌లో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి కృషి


బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

అంబర్‌పేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమ్‌నగర్‌లో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర చేసి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కలుషిత నీటి సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జంతు సంరక్షణపై అవగాహన ర్యాలీ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రవల్లిక తదితరులు

నల్లకుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జంతు సంరక్షణ కోసం వీగాన్స్ ఆఫ్ తెలంగాణ శాఖ పలు సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సంజీవయ్య పార్కు నుంచి నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ సామాజిక వేత్త, న్యాయవాది ప్రవల్లిక, జంతు ప్రేమికులు సూరజ్, ఇషాంత్, రఘురామ్, పంచ్ తదితరులు మాట్లాడారు. జంతు సంరక్షణ కోసం 2016 నుంచి కృషి చేస్తున్నామన్నారు.

ఏఐ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో యువతీ, యువకులు, విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ కోర్సుల్లో శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా, పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ ఇస్తుందని తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9505800047 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గోల్నాక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 12 మందికి రూ. 5.50 లక్షల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం తులసినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మరో 11 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 3.60 లక్షల విలువైన చెక్కులను బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఉప్పలమ్మ దేవాలయ వార్షికోత్సవం

ముషీరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గంగపుత్ర కాలనీలో ప్రసిద్ధిగాంచిన ఉప్పలమ్మ దేవాలయం 23వ వార్షికోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పురి నందు, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లంపల్లి రాంరెడ్డి, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బద్రినారాయణ పాల్గొన్నారు.

రిసాలగడ్డలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి


రిసాలగడ్డలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రిసాలగడ్డలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి నూతన పైపులైన్ వేయాలని కార్పొరేటర్ కె. రవిచారి జలమండలి అధికారులను కోరారు. గురువారం రిసాలగడ్డలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పైపులైన్‌కు నిధులు మంజూరైనందున వెంటనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించాలన్నారు. జలమండలి చిలకలగూడ డీజీఎం మోహన్‌రావు మాట్లాడుతూ.. పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనుల పరిశీలన


డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారత్ సేవా సమాజ్ వీధిలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పైపులైన్ నిర్మాణంతో భారత్‌సేవా సమాజ్ వీధిలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ఆదుకోవడమే రాహత్ క్రైసిస్ కేంద్రం లక్ష్యం


రాహత్ క్రైసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ క్రిస్టినా స్కాట్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గృహహింస వలయంలో చిక్కుకున్న మహిళలను ఆదుకోవడమే రాహత్ క్రైసిస్ కేంద్రం లక్ష్యమని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ క్రిస్టినాస్కాట్, తెలంగాణ-ఏపీ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పేర్కొన్నారు. ఆబిడ్స్‌లో ఫెర్నాండెజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాహత్ క్రైసిస్ కేంద్రాన్ని వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలో ఇలాంటి సెంటర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.